## అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం



**రాయపోల్, ఏప్రిల్ 11 (ప్రభాతవార్త):** మండలంలోని రాంసాగర్ గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు కొనసాగిన ఈ వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు అయిన శనివారం ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి పోయింది. ఉదయం అవివాహిత పూజతో ప్రారంభమైన కార్యక్రమాలు, శ్రీరామ మూల మంత్ర హవనం, బలి ప్రదానం, పూర్ణాహుతి, కలశోత్సవం, ఆశీర్వచనం వంటి విశిష్ట క్రతువులతో ఘనంగా కొనసాగాయి. వేద మంత్రాల నినాదాల మధ్య సీతారాముల దివ్య కళ్యాణం నిర్వహించగా, ఆలయ పరిసరాలు భక్తి పారవశ్యంలో మునిగిపోయాయి. స్వామివారి దివ్య కళ్యాణ దృశ్యాన్ని తిలకించేందుకు సమీప గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఉత్సవ వాతావరణంలో గ్రామం మొత్తం ఆధ్యాత్మిక కాంతులతో మెరిసిపోయింది. అనంతరం హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు మహా అన్న ప్రసాదం అందజేశారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
# వార్త

## కేంద్ర మంత్రి రామ్‌దాస్ అత్‌వాలేను కలిసిన జాతీయ మాల మహానాడు నాయకులు

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** హైదరాబాద్‌లోని మంజీరా గెస్ట్ హౌస్‌లో శనివారం రోజున నిర్వహించిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర స్థాయి సమావేశానికి కేంద్ర మంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షుడు రామ్ దాస్ అత్ వాలే ను జాతీయ మాల మహానాడు హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆరె కిశోర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల మూడోసారి రాజ్యసభకు ఎన్నికైనందుకు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హుస్నాబాద్ నియోజకవర్గంలో ఉన్న దళిత, బహుజన వర్గాల సమస్యలను కేంద్ర మంత్రికి వివరించారు. తెలంగాణలో ఆర్ పి ఐ (ఎ) పార్టీని మరింత బలోపేతం చేయాలని, పార్టీకి అనుబంధంగా కలిసి పనిచేయాలని కేంద్ర మంత్రి సూచించారు.



కేంద్ర మంత్రి, ఆర్‌పిఐ పార్టీ జాతీయ అధ్యక్షుడిని కలిసిన మాలమహానాడు నాయకులు



కంకరతేలిన మాచిరెడ్డిపల్లి రోడ్డు

## కంకర తేలిన రోడ్డు తప్పని ప్రయాణం

**సదాశివపేట,ఏప్రిల్ 11 (ప్రభాతవార్త):** ఈ రోడ్డుపై ప్రయాణం కష్టం అనిపించిన తప్పదం లేదని మాచిరెడ్డిపల్లి గ్రామస్తులు అంటున్నారు. సదాశివపేట నుండి వెంకటాపూర్ గ్రామం ద్వారా మాచిరెడ్డిపల్లికి రావాలి అంటే సుమారు 5 కిలోమీటర్లు ఉంటుందని, అదే నిజాంపూర్ గ్రామంవైపు నుండి రావాలి అంటే సుమారు పది కిలోమీటర్లు అవుతుందని గ్రామస్తులు అంటున్నారు. వెంకటాపూర్ వరకు రోడ్డు బాగానే ఉన్నప్పటికీ సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డు మాచిరెడ్డిపల్లి వరకు కంకర తేలి నడవడానికి కూడా కష్టంగా ఉన్నదని వారు అంటున్నారు. నిత్యం పాల వ్యాపారస్తులు గాని ఇతరత్రా రోజు పనులకు వెళ్లేవారు ఉద్యోగం చేసుకునేవారు సదాశివపేటకు వెళ్లి రావాలి అంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని భయపడుతూ ఈ రోడ్డుపై ప్రయాణం చేయవలసి వస్తుందని వారు అంటున్నారు. ఎన్నికలలో గెలుపొందడానికి హామీలు గుప్పిచ్చే నాయకులకు వారు గెలిచిన తర్వాత ఈ రోడ్డు కనిపించడం లేదా.. ఏ పార్టీ గెలిచినా అందరూ దొందూ దొందే అంటున్నారు. రాజకీయ పెద్దలు ప్రభుత్వ అధికారులు ఒకసారి ఈ రోడ్డు వైపు ప్రయాణం చేస్తే మా బాధ వారికి అర్థం అవుతుందని అంటున్నారు. నాయకులు కల్పించుకొని రోడ్డును బాగు చేయించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు .

## వైభవంగా శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 11 (ప్రభాతవార్త):** గజ్వేల్‌లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శేషం శ్రీనివాసచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ కైలాస లక్ష్మణ్ మాట్లాడుతూ కలియుగ దైవం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయని నేటి నుండి 6 రోజుల వరకు నిర్వహించే విశేష పూజా కార్యక్రమాల్లో ప్రతి రోజు భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు మహా అన్న ప్రసాదం అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సంవత్సరం ఆలయంలో నూతనంగా పుష్కరిణి, నవగ్రహ ప్రతిష్ట మొదలగు విశేష ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్నాయని, స్వామివారి కళ్యాణంలో రథోత్సవంలో పాల్గొనాలని, బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. అలాగే బ్రహ్మోత్సవాలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి స్వామివారి కృపా కటాక్షాలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో యజ్ఞాచార్య ఉదయ్‌కుమార్ ఆచార్యులు, ఆలయ ప్రధాన కార్యదర్శి గార్లపాటి వెంకటేశ్వర్లు, కోశాధికారి అత్తెల్లి కిషన్, ఉపాధ్యక్షులు ఏడెల్లి శ్రీనివాస్, మాందాల తిరుపతిరెడ్డి, సహాయ కార్యదర్శులు గందే యాదగిరి, దేవులపల్లి రాజారామ్, ఆలయ కమిటీ సభ్యులు, వికాస తరంగిణి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్సీ

**వర్గల్, ఏప్రిల్ 11 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని శేరిపల్లి గ్రామంలో ఎమ్మెల్సీ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను శనివారం గ్రామంలోని పెద్దమ్మతల్లి గుడి వద్ద ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యర్ర పావని మోహన్‌రెడ్డి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ముదిరాజ్ సంఘం నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

## సమానత్వం, మహిళా విద్యకు మార్గదర్శి పూలే

**టిజిఐఐసి చైర్పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**సంగారెడ్డి మున్సిపాలిటీ , ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** మహాత్మ జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలు జిల్లాలో శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, శాసన సభ్యులు చింతా ప్రభాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్, అదనపు కలెక్టర్ పాండు తదితరులు జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నటరాజ్ థియేటర్ సమీపంలో నిర్వహించిన జయంతి ఉత్సవ కార్యక్రమంలో పాల్గొని పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.ఈ సందర్భంగా టిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, మహాత్మ జ్యోతిరావు పూలే సమాజంలో సమాన త్వం , మహిళా విద్య కోసం చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కలగాలని ఆశించిన గొప్ప సంస్కర్తగా ఆయనను కొనియాడారు. మహిళల విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవల వల్లనే నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని పేర్కొన్నారు. యువత ఆయన స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కట్టుబడి పాఠశాలలు, హాస్టళ్లలో అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నదని తెలిపారు. మహిళా విద్యకు పునాది వేసిన సావిత్రిబాయి పూలే సేవలను గుర్తుచేశారు. పూలే దంపతుల స్ఫూర్తితో యువత సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఆయన ఆలోచనలు నేటి సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు.జిల్లాలో బీసీ వసతి గృహాల్లోని విద్యార్థుల కోసం సి.ఎస్.ఆర్ నిధుల కింద రూ.35 లక్షలతో ట్రంక్ బాక్సులు తదితర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. అలాగే రూ.1.52 కోట్ల వ్యయంతో హాస్టల్ భవనాల మరమ్మతులు చేపట్టినట్లు చెప్పారు. ఎస్ఎస్సి విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్ గైడ్స్ అందజేసినట్లు, గత సంవత్సరం పదవ తరగతిలో 99.5 శాతం ఉత్తీర్ణత సాధించారని, ఈ సంవత్సరం 100 శాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్, అదనపు కలెక్టర్ పాండు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జగదీష్, వివిధ శాఖల అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, యువత, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

# హాజరు కోసం ఉపాధి కూలీల పడికాపులు

**సదాశివపేట,ఏప్రిల్ 11 (ప్రభాతవార్త):** ఎండను తట్టుకోలేక చెట్టు పొదలమాటున సేద తీరుతున్న అభాగ్యులు.. త్రాగడానికి నీళ్లు కూడా లేక అవస్థలు పడుతున్న దీనులు.. పనులు గాయాలు అవుతున్న నొప్పిని భరించుకుంటున్న అమాయకులు..వేసవి కాలంలో గ్రామంలోని రైతు కూలీలకు ఉపాధి లేక అవస్థలు పడుతున్నారని గ్రహించిన కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని ప్రారంభించింది. వంద రోజులపాటు జరిగే ఈ పథకం ద్వారా రైతు కూలీలకు ఆసరా దొరికింది. అంతా బాగానే ఉంది కానీ ఈ పథకంలో జరిగిన కొన్ని అవకతవకల వలన కూలీల హాజరు నమోదు చేసే ప్రక్రియలో మార్పులు తెచ్చింది. ప్రత్యేక యాప్ ద్వారా పనిచేసే చోట అతని ముఖం చూపుతూ హాజరు నమోదు చేయడం పై ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆ ప్రదేశంలో నెట్ పనిచేయకపోవడంతో హాజరు కోసం కూలీలు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని రోజులుగా మాకు హాజరు పడడం లేదని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని కొందరు కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం త్రాగడానికి కూడా నీళ్లు లేక చెట్ల కింద పొదలమాటున సేద తీర్చుకోవాల్సి వస్తుందని దీనంగా తెలిపారు. పనిచేసేటప్పుడు దెబ్బలు తగిలిన మమ్మల్ని పట్టించుకునే నాధుడే కరువైనాడని వారు అన్నారు. ఈ విషయమై మాచిరెడ్డిపల్లి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ మాట్లాడుతూ అప్పుడప్పుడు ఓటీపీ ప్రాబ్లెం కూడా ఇస్తున్నామని ఆఫీసులో ఉన్నాయని నీళ్లు కూడా తెస్తామని అన్నారు. నిజాంపూర్ కూలీలను ఉద్దేశించి వారి అధికారి ఫోన్లో మాట్లాడుతూ కూలీలు సరిగా సమయానికి రావడం లేదని హాజరు తీసుకోగానే వెంటనే వెళ్లిపోయే వారికి మంచినీళ్లు ఎందుకని అన్నారు. ఎప్పుడో ఒకసారి వచ్చి పోయే అధికారులకు మా గోడు వినిపిస్తాము అంటారు కానీ, అమలు చేయలేని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎండాకాలంలో పనిచేసిన కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. ఏసీలలో కూర్చుని అధికారులకు ఎండ బాధ ఎలా తెలుస్తుందని వారు వాపోతున్నారు.



హాజరు కోసం పడి కాపులు పడుతున్న ఉపాధి కూలీలు



లబ్దిదారులకు చేరాల్సిన ఆధార్‌కార్డులు ఆడివిపాలు చేసిన తపాళ శాఖ

# దీనికి బాధ్యులెవరు?

## లబ్దిదారులకు చేరాల్సిన ఆధార్‌కార్డులు, ఉత్తరాలు ఆటవీ పాలు

**కౌడిపల్లి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** ఎంతో ప్రతిష్టాత్మకంగా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేసే తపాళ శాఖ కార్యాలయాల సిబ్బంది నిర్లక్ష్య వైఖరియా? సిబ్బంది కొరతనా..? తెలియదు కాని విలువైన ఉత్తరాలు, ప్రత్యుత్తరాలు, ఆధార్ కార్డులు, అత్యవసర ఉత్తరాలు సైతం సంబంధిత వ్యక్తులకు చేర్చకుండా ఏకంగా అటవీ ప్రాంతంలో పారబోసిన విడ్డూరకరమైన సంఘటన శనివారం నాడు కౌడిపల్లి గ్రామ భట్టమ్మ ఆలయ అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. వివరా లకు వెళితే శివ్వంపేట మండలం గోమారం గ్రామానికి చెందిన తపాళాశాఖ కార్యాలయంకు వచ్చిన ఆధార్ కార్డులను లబ్దిదారులకు పంచకుండా జమ చేసి, వాటిని, మరికొన్ని ముఖ్యమైన ఉత్తరాలు, మన దేశ జాతీయ జెండా, ఆలయాలకు సంబంధించి అత్యవసర ఉత్తరాలను ఒక సంచీనిండా తెచ్చి కౌడిపల్లి అటవీ ప్రాంతంలో పారబోసినారు. ఏకంగా వన నియోజకవర్గ ఎమ్మెల్యే సొంత గ్రామ తపాళశాఖ కార్యాలయం సిబ్బంది నిర్వాకం చాల శోచనీయంగా ఉంది. పరోక్షంగా తపాళశాఖ సిబ్బంది సైబర్ నేరగాళ్లకు సహాయం అందించినట్లుగా ఉంది. నేటి ఆధునిక యుగంలో సాంకేతిక పరిజ్ఞానం విస్తరించినప్పటికీ కూడా కొన్ని విషయాల్లో తపాళ శాఖ కార్యాలయంపై ఆధారపడాల్సిందే మరి. ప్రస్తుత తరుణంలో పోస్టల్ సిబ్బంది ఈ విధంగా వ్యవహరిస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనుసంధానంగా మారిన ఆధార్ కార్డుల విషయంలో నిర్లక్ష్యవైఖరిని వ్యవహారించడం సిగ్గుచేటు అని పలువురు మేధావులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా తపాళశాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి సమగ్ర దర్యాప్తు జరిపించి, ప్రజలకు తపాళశాఖ నుండి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

- భూములు ఇచ్చిన రైతులకు ఇంటి స్థలాలు కేటాయించాలి
- ప్లాట్లు ఇచ్చిన తర్వాతే మార్కెట్ పనులు ప్రారంభించాలి
- పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నంకు యత్నించిన బిజెపి మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్

# మార్కెట్ యార్డు పనులను అడ్డుకున్న రైతులు

**ములుగు, ఏప్రిల్ 11 (ప్రభాతవార్త):** మార్కెట్ యార్డు కోసం భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వ అధికారులు ఇచ్చిన హామీ ప్రకారం 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాకే మార్కెట్ యార్డు నిర్మాణానికి సంబంధించిన భూమి చదును పనులను ప్రారంభించుకోవాలని రైతులతో కలిసి స్థానిక సర్పంచ్ బాబుగౌడ్, బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, మాజీ సర్పంచ్ హంస మహేష్‌యాదవ్‌లు రాజీవ్ రహదారిపై ఆందోళన చేపట్టారు. ములుగు మండలంలోని వంటిమామిడి మార్కెట్ యార్డు రాజీవ్ రహదారికి ఆనుకొని ఉండడంతో ప్రతిరోజు ఉదయం మార్కెట్ రైతులతో కిక్కిరిసిపోతున్న క్రమంలో మార్కెట్‌కు కూరగాయలు తీసుకొచ్చిన రైతులతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో మార్కెట్‌కు ఎదురుగా ఉన్న స్థలంలోనికి ఉదయం జరిగే మార్కెట్‌ను మార్చాలని పోలీసులు, మార్కెట్ అధికారులు కలిసి నిర్ణయం తీసుకొని శనివారం ఉదయం మార్కెట్ యార్డుకు ఎదురుగా ఉన్న భూమిలో జెసిబి యంత్రాలతో పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న చిన్నతిమ్మాపూర్, లక్ష్మక్కపల్లి గ్రామాలకు చెందిన రైతులు వెంటనే అక్కడికి చేరుకొని ఆందోళనకు దిగి పనులను ఆపి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఐదు సంవత్సరాల క్రితం రెవెన్యూ అధికారులు రైతుల నుండి సుమారు 82 ఎకరాల భూమిని సేకరించి, ఎకరానికి రూ.8.50 లక్షల చొప్పున పరిహారం



ఆత్మహత్యా యత్నంకు పాల్పడిన లక్ష్మణ్‌గౌడ్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

చెక్కుల రూపంలో చెల్లించారు. అదనంగా మార్కెట్ సమీపంలో 20 ఎకరాల భూమిలో ఇంటి స్థలాలను కేటాయిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, అవి ఇప్పటి వరకు అమలు కాలేదని రైతులు అన్నారు. రైతులు వారి ఇండ్లకు సమీపంలో గల ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో రాజీవ్ రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహిస్తుండగా సమాచారం అందుకున్న గజ్వేల్ ఏసిపి నర్సింలు, స్థానిక ఎస్ఐ రఘుపతి అక్కడికి చేరుకొని రైతులతో చర్చించి ఆందోళన విరమించాలని చెప్పడంతో బిజెపి



రాజీవ్ రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు

మండలపార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించడంతో పోలీసులు వెంటనే అతన్ని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం హామీ ప్రకారం భూమిని కోల్పోయిన ప్రతి రైతుకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించాకే మార్కెట్ పనులు చేపట్టాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేసి ప్రాణత్యాగాలకైనా సిద్ధపడతామని హెచ్చరించారు. ఈ సమస్యపై స్థానిక తహసిల్దార్ రవీందర్‌రెడ్డిని వివరణ కోరగా ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఎలాంటి నష్టం జరగకుండా వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తామని తెలిపారు.

# అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఉక్కుపాదం

**అమీన్‌పూర్ ,ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ ప్రాంతంలో శనివారం ఉదయం భారీ ఎత్తున హైడ్రా బలగాలు మోహరించి అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపాయి. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు కూల్చివేత చర్యలను చేపట్టారు .ప్రభుత్వ భూములు భవిష్యత్తులో ఆక్రమణలకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తగా సంబంధిత భూములకు ఇనుప కంచె ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ చర్యలవల్ల పేదలకు ఎలాంటినష్టం కలగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా వివాదాస్పద ఐలాపూర్ భూముల్లో న్యాయవాదికి చెందిన గెస్ట్ హౌస్‌ను పూర్తిగా నేలమట్టం చేశారు. అలాగే ఆయన సోదరుడు నిర్మించిన బహుళ అంతస్తుల భవనంపై కూడా హైడ్రా అధికారులు చర్యలు కొనసాగించారు. సమీప గ్రామాల సర్వే నంబర్లతో అనుమతులు పొందినట్లు ఆరోపణలు ఉన్నా ఈ భవనాన్ని కూల్చివేతకు పూనుకున్నారు.నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు



కూల్చివేసిన భవనం

చేపట్టిన వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు.

**ఐలాపూర్‌లో జరుగుతున్న కూల్చివేతలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వివరణ**

ఐలాపూర్ భూములకు సంబంధించి 1998లో హైకోర్టు స్టేటస్ కో ఉన్నట్లు తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వ భూములను ఆక్రమించి ఫామ్ హౌస్ నిర్మించుకున్నారని వెల్లడించారు.2006లో నిర్మించిన ఈ ఫామ్ హౌస్‌ను క్రమంగా విస్తరించి ప్రస్తుతం దాదాపు 40 ఎకరాలకు పెంచినట్లు తెలిపారు. ఈ ఫామ్ హౌస్‌ను కేంద్రంగా చేసుకుని గత రెండు దశాబ్దాలుగా తన అనుచరులతో కలిసి భూదందా కొనసాగించినట్లు ఆరోపించారు.ప్రభుత్వ భూములను అక్రమంగా ప్లాట్లుగా విభజించి విక్రయించడం ద్వారా కోట్ల రూపాయలు సంపా దించినట్లు తెలిపారు.

ముఖ్యంగా పేదలను లక్ష్యంగా చేసుకుని 100 గజాల ప్లాట్లను సుమారు రూ.10 లక్షల చొప్పున విక్రయించినట్లు పేర్కొన్నారు.హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ భూకబ్జాలకు పాల్పడినట్లు స్పష్టం చేసిన రంగనాథ్, ఐలాపూర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చి వేతపై హైకోర్టు ఎలాంటి స్టే ఇవ్వలేదని తెలిపారు. సోషల్ మీడియాలో హైడ్రా చర్యలపై తప్పుడు ప్రచారం జరుగుతోందని మండిపడ్డారు .ప్రభుత్వ భూములను రక్షించడం, భవిష్యత్తులో ఆక్రమణలు జరగకుండా నిరోధించడం కోసం ఈ కూల్చివేతలు

## రింగ్‌రోడ్డు నిర్మాణం పూర్తికి సిఎం హామీ

**గజ్వేల్, ఏప్రిల్ 11 (ప్రభాతవార్త):**

గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగ్‌రోడ్డు నిర్మాణాన్ని పూర్తి స్థాయిలో నిర్మించకపోవడం రెవెన్యూ అధికారుల అలసత్వమేనని మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు విమర్శించారు. శనివారం గజ్వేల్ పట్టణ శివారులో ఉన్న రింగ్‌రోడ్డును స్థానిక బిజెపి నాయకులతో కలిసి పరిశీలించారు. సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి అసంపూర్తిగా ఉన్న గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగ్ రోడ్డు గురించి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. రింగ్ రోడ్డు నిర్మాణం కొరకు పూర్తి సహకారం అందిస్తానని, రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తయ్యేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి పూర్తి చేయిస్తానని సిఎం హామీ ఇచ్చినట్లు రఘునందన్‌రావు తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయకపోవడం సిగ్గుచేటన్నారు. 90 శాతం రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తయినప్పటికీ, ఒక రైతును మెప్పించి రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయలేకపోయారని రెవెన్యూ అధికారులపై మండిపడ్డారు. భూసేకరణ చట్టం ప్రకారం సంబంధిత రైతుకు నష్టపరిహారం చెల్లించి రింగ్‌రోడ్డు పూర్తి చేయాలన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకురావడంతోనే ఆయన వెంటనే స్పందించి రింగ్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయిస్తానని చెప్పడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. త్వరలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగ్‌రోడ్డు పూర్తవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన వెంట గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, 4వ వార్డు కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, సురేష్, కృష్ణ, నలగామ శ్రీనివాస్, రాజేశ్వరచారి, బిజెపి మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అసంపూర్తిగా ఉన్న రింగ్‌రోడ్డును పరిశీలిస్తున్న ఎంపి రఘునందన్‌రావు

# నిర్వహణ లోపం.... పాడి రైతులకు శాపం

**పాల శీతల కేంద్ర తరలింపుకు నిర్వాహకులు ఉత్సాహం**

**పాపన్నపేట, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** పాడి రైతుల సంఖ్య అనువుగా రవాణా సౌకర్యాలను బట్టి నిర్ణయించిన పాల శీతల కేంద్రాన్ని తరలించే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో పాడి రైతులకు పాల విక్రయాలలో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. పాడి రైతుల కోసం ఏర్పాటు చేసిన పాల శీతల కేంద్రం నిర్వహణ లోపం, యాజమాన్యం నిర్లక్ష్యం మూలంగా పాల శీతల కేంద్ర యంత్రాలను వేరే ప్రాంతాలకు తరలించేందుకు పూనుకోవడంతో పాడిరైతులు పాలవిక్రయాలు జరిపేం దుకు పట్టణాలకు పాలను తరలించే పరిస్థితి నెలకొంది.దీంతో పాడి రైతులు పాల శీతల కేంద్రాల యంత్రాలను తరలించవద్దని విజయ డెయిరీ యాజమాన్యం తో మొరపెట్టు కొంటున్నారు. మండల కేంద్రమైన పాపన్న పేట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అర్బన్ నిధుల సహాయంతో పాల శీతల కేంద్ర ఏర్పాటుకు ఓ గదితో పాటు శీతల కేంద్ర నిర్వహణకు కావలసిన విద్యుత్, గదులను ఏర్పాటు చేసింది. దీంతో విజయ డెయిరీ యాజమాన్యం ముందుకు వచ్చి పాల శీతల కేంద్ర యంత్రాలను అమర్చి పాలను కొనుగోలు చేస్తూ టెక్మాల్, పాపన్న పేట మండల పాడి రైతుల ద్వారా పాలను కొనుగోలు చేస్తూ పాడి రైతుల పాల విక్రయాలకు రైతులు ఇబ్బందులకు గురికావద్దని సౌలభ్యం కల్పించింది . దీంతో పాడి రైతులు పాల విక్రయాలు జరుపుతూ పాడి పరిశ్రమపై మక్కువతో పాడి పశువులను పెంచేందుకు ముందుకు సాగుతున్నారు. అయితే విజయ డెయిరీ నిర్వాహకుల నిరక్ష్యం మూలంగా పాల శీతల కేంద్రం నిర్వహణ లోపించిందని గత ఆగస్టునెలలో మూతకు గురైంది. దీంతో పాడి రైతులు పాల విక్రయాలలో తీవ్ర వ్యయ ప్రయాసలతో పాలను విక్రయించుకొంటున్నారు. అయితే పాడి రైతుల అభివృద్ధి కోసం పాటు పడాల్సిన సంబంధిత నిర్వాహకులు. పాడి నిబంధనలు పాటించకుండా శీతలకేంద్రాన్ని తరలించేందుకు పూనుకు న్నారు. పాడి నిబంధనల ప్రకారం పాడి శీతల కేంద్రాన్ని తరలించాలన్న పాడి రైతులతో సమావేశాలు నిర్వహించి, పాల లభ్యత , స్థితిగతులను వివరించాల్సి ఉంటుంది. కానీ విజయ డెయిరీ కేంద్ర నిర్వాహకులు మాత్రం పశువర్ధక శాఖ నిబంధనలు పాటించకుండా పాడి రైతులతో సమావేశాలు నిర్వహించకుండానే కేంద్ర తరలింపుకు పూనుకున్నారు. రైతులకు దగ్గరగా గ్రామానికి చేరువగా అనువైన స్థలంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని నిర్వాహకుల నిర్లక్ష్యం మూలంగా శీతల కేంద్రం మూతకు గురైంది. జిల్లా కలెక్టర్ దృష్టి సారించి పాడి రైతుల కు అనువుగా ఉన్న శీతల కేంద్రాన్ని తరలించకుండా చూసి కేంద్రాన్ని తెరిపించి పాడి రైతులను ఆదుకోవాలని పాపన్న పేట, టెక్మాల్ పాడి రైతులు కోరుతున్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**గ్రామ కమిటీలకు బిఆర్ఎస్ నేతల పిలుపు**

**కందుకూరు, ఏప్రిల్ 11, ప్రభాత వార్త:** కందుకూరు మండలంలో బిఆర్ఎస్ పార్టీ సంస్థాగత బలోపేతంపై దృష్టి సారించింది. మహేశ్వరం శాసనసభ్యురాలు, పి. సబితా ఇంద్రారెడ్డి ఆదేశానుసారం, మండల పార్టీ అధ్యక్షులు మన్నె జయేందర్ నాయకత్వంలో నూతన గ్రామ కమిటీల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా శనివారం మండల పరిధిలోని దెబ్బడగూడ గ్రామంలో బిఆర్ఎస్ నూతన కమి టీతో పాటు అనుబంధ సంఘాల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి గ్రామానికి నియమితులైన ఇన్చార్జీలు, కందుకూరు మాజీ ఎంపీటీసీ సురసాని రాజశేఖర్ రెడ్డి, బొక్క దీక్షత్ రెడ్డి పర్యవేక్షకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా దెబ్బడగూడ గ్రామ శాఖ అధ్యక్షులుగా వరికుప్పల నాగేష్, ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, రాజేందర్, దార మధు, ప్రధాన కార్యదర్శులుగా దేరంగుల యాదగిరి, రఘునందన్ గౌడ్ నియమితులయ్యారు. వీరితో పాటు బూత్ స్థాయి కమిటీని కూడా ఏర్పాటు చేశారు. అనుబంధ సంఘాల విభాగంలో యూత్ అధ్యక్షులుగా ఢిల్లీ వినోద్, బీసీ సెల్ అధ్యక్షులుగా వీ యాదగిరి, ఎస్సీ సెల్ అధ్యక్షు లుగా ధార మధు, ఎస్టీ సెల్ అధ్య క్షులుగా రామావత్ పవన్, మైనార్టీ సెల్ అధ్యక్షులుగా అబ్బాస్ అలీ, సోషల్ మీడియా ప్రతినిధిగా శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు.

**కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రాభివృద్ధి**

ఈ సందర్భంగా ఇన్చార్జ్ సురసాని రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో పదేళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో దేశానికి ఆదర్శంగా నిలిచిందని గుర్తు చేశారు. గ్రామ కమిటీలు పార్టీ బలోపేతానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరిం చిందని, గత ప్రభుత్వం అమలు చేసిన రైతు సంక్షేమం, పేదల సంక్షేమ కార్యక్రమాలను కాలరా స్తోందని విమర్శించారు.

అన్ని వర్గాల ప్రజలను పార్టీ వైపు ఆకర్షింపజేసి, రాబోయే ఎన్నికలలో బిఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని, తద్వారా మళ్లీ కేసీఆర్ పాలన ప్రజలకు అందేలా చూడాలని ఆయన కోరారు.

## సర్పంచ్ భర్త పెత్తనం ఆపండి

**అధికారులను బెదిరిస్తున్నారు**

**నిధులు పక్కదారి పడుతున్నాయ్**

**కార్మికుల జీతాల్లోనూ కోత**

**మంబాపూర్‌లో అధికార దుర్వినియోగంపై మాజీ సర్పంచ్‌ల ఆగ్రహం**

**కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిక**



సర్పంచ్ భర్త అధికారిక సమావేశాలలో మాట్లాడుతున్న ఫొటోలను చూపిస్తున్న మాజీ సర్పంచ్‌లు, వార్డుమెంబర్లు

**పెద్దేముల్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** అధికారులను బెదిరింపులకు గురిచేస్తూ, అధికార దుర్విని యోగానికి పాల్పడుతున్న మంబాపూర్ సర్పంచ్ భర్త శ్రీనివాస్ వైఖరిపై మాజీ సర్పంచ్ ఆర్.శ్రావణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంబాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ అధికారిక సమావేశాల్లో సర్పంచ్ స్థానంలో ఆమె భర్త పాల్గొనడం చట్టవిరుద్ధమని ధ్వజమెత్తారు. ముఖ్యంగా ఉపాధి హామీ, ఆర్ డబ్ల్యుఎస్ సమావేశాల్లో సర్పంచ్‌ను మౌనంగా ఉంచి భర్త మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. వార్డు మెంబర్ల తీర్మానం లేకుండా, కనీస సమాచారం ఇవ్వకుండా జీపి నిధులను ఇష్టాను సారంగా వాడుకుంటున్నారని ఆరోపించారు. పారిశుద్ధ్య కార్మికుల కోసం మూడు నెలల జీతాలు డ్రా చేసి, కేవలం రెండు నెలల జీతమే ఇచ్చి డబ్బులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. గతంలో పది లక్షల రూపాయలతో చేసిన పనులకు సంబంధించిన నిధులను చెల్లించకుండా బుకాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, యాదప్ప అనే వ్యక్తికి చెందాల్సిన సైడ్ డ్రెయిన్ బిల్లులను పక్కదారి పట్టించారని ఆరోపించారు. గ్రామసభలు నిర్వహించకుండా నిబంధనలకు తిలోదకాలిస్తున్నారని, 15వ ఆర్థిక సంఘం నిధుల విషయంలో తమకు ఎలాంటి సమాచారం లేదని నేతలు పేర్కొన్నారు. ఈ అక్రమాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, ఉన్నతాధికారులు స్పందించి మంబాపూర్‌లో సక్రమమైన పాలన అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్‌లు పి.ప్రకాశం, బోయిని నారాయణ, వార్డు మెంబర్లు నర్సిములు, రత్నం, చంద్రప్ప మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.



కబడ్డి క్రీడాకారులను సన్మానిస్తున్న దృశ్యం

## కబడ్డీ పోటీల్లో కేశంపేట ఘన విజయం

**కేశంపేట ఏప్రిల్ 11 ప్రభాతవార్త :** ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ పోటీల్లో భాగంగా నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో కేశంపేట మండల కేంద్రం ప్రథమ స్థానంలో నిలవగా, చింతకుంటపల్లి జట్టు ద్వితీయ స్థానాన్ని సాధించింది. మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ ఆధ్వర్యంలో, యువతను క్రీడల్లో ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహించబడ్డాయి. ఆర్గనైజేషన్ ఇంచార్జులుగా కంచుకోట మహేష్, కర్రెడ్ల నరేందర్ రెడ్డి, యుగంధర్, మరియు పీఈటీ ఆనంద్ బాబు పర్యవేక్షించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన జట్లు పోటీల్లో పాల్గొని గట్టి పోటీని ఇచ్చాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేసి, క్రీడాకారులను ఘనంగా సన్మానించారు.



క్రికెట్ టోర్నమెంటును ప్రారంభిస్తున్న సిఐ

## క్రీడలు జీవితాన్ని తీర్చిదిద్దే సాధనం

**షాద్‌నగర్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** క్రీడలు కేవలం ఆటలు కాదు, జీవితాన్ని తీర్చిదిద్దే సాధనం అని, ప్రధాని మోదీ దేశంలో క్రీడలకు కొత్త ఊపిరి పోస్తున్నారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. సంసద్ ఖేల్ క్రీడా కార్యక్రమంలో భాగంగా, షాద్‌నగర్ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను బిజెపి యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జ్ నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, పార్టీ నాయకులు అందే బాబయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, జనార్దన్ రెడ్డి (పార్లమెంట్ కోఆర్డినేటర్) ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రికెట్ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులకు బ్యాట్లు, బంతులు, టీషర్ట్స్, క్యాప్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, యువత క్రీడా స్ఫూర్తిని జీవితంలో అవలంబించాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సంసద్ ఖేల్ కోఆర్డినేటర్ వంశీకృష్ణ, మున్సిపాలిటీ కోఆర్డి నేటర్ ఋషికేశ్, చెంది మహేందర్, వెంకటేష్ గుప్తా, మనో హర్ రెడ్డి, ఈసునాథి శ్రీనివాస్, మల్చలం మురళి, శ్రీనివాస్ చారి, వినోద్ నాయక్, కాయమ మహేష్, లక్ష్మీ మకాంత్ రెడ్డి, సుధాకర్ అప్పా, మల్చ లం రాము, పద్మ సాయి, పుట్నాల సాయి, అందేళ సందీప్, రాజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి

## క్రీడలతోనే క్రమశిక్షణ, ఆరోగ్యం

**పెద్దేముల్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలం తట్టెపల్లి గ్రామంలో మొగల్చంద్ర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రభుకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన తట్టెపల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంటు శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ పోటీలను తాండూరు రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, స్థానిక ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత మరియు ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దారుఢ్యాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండటానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం ఎంతో అవసరమని ఆయన అన్నారు. క్రీడల ద్వారా గ్రామానికి మంచి గుర్తింపు తీసుకురావాలని, క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు నారాయణ్ గౌడ్, వెంకట్, మాజీ వైస్ చైర్మన్ అంజయ్య, వార్డు మెంబర్లు మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఉషార్‌పల్లికి ఆర్టీసీ బస్సుసౌకర్యం

**శామీర్‌పేట, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:** ఉషార్‌పల్లిలో ప్రయాణికుల సౌకర్యం కోసం నూతనంగా ఆర్టీసీ బస్సు సర్వీసును మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి. జైపాల్‌రెడ్డి ప్రారంభించారు. శనివారం మూడుచింతలపల్లి మండలంలోని ఉషార్‌పల్లిలో హకీంపేట్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సుకు ఆయనతో పాటు మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశం, పలువురు కౌన్సిలర్లు పాల్గొని పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్య, వైద్య, ఉద్యోగ, వ్యాపార అవసరాల కోసం గ్రామీణ ప్రాంతం నుండి సికింద్రాబాద్‌కు వెళ్లే ప్రయాణికులకు ఈ బస్సు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దోసకాయల లత వెంకటేశం, పి. శ్రీలత వెంకట్రెడ్డి, ఎం. గోవర్దన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఎన్. విష్ణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బస్సును ప్రారంభిస్తున్న జిల్లా ఆర్టీఏ మెంబర్ బి. జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశం

## రూ. 10 లక్షలతో అండర్ డ్రైనేజీ పనులు

**లింగారెడ్డి గూడాలో తొలగనున్న కాలువ కష్టాలు**

**షాద్‌నగర్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** కాలువ నిర్మాణం లేక ఎదురవుతున్న ఇబ్బందులకు చెక్ పెడుతూ ఫరూక్ నగర్ మండలం లింగారెడ్డిగూడెం గ్రామంలోని పదవ వార్డులో అండర్ డ్రైనేజీ పనులను గ్రామ సర్పంచ్ ఎంసీ ప్రవీణ్ కుమార్, ఉపసర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ. పది లక్షల వ్యయంతో ఈ కాలువ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కాలువ నిర్మాణం పూర్తయితే గ్రామంలో దుర్గంధ సమస్య పరిష్కారం అవుతుందని వారు వెల్లడించారు. గ్రామాభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్ రెడ్డి, వార్డు సభ్యులు వట్టెల మల్లేష్ యాదవ్, దీపిక, వీరేష్ గౌడ్, ఎర్రోళ్ల మమత, అరుణ్ కుమార్, శశాంక్ గౌడ్, మాధవి, గణేష్, బాలమణి, కందూరి అంజయ్య గౌడ్, పంతులు లక్ష్మయ్య, అప్పన్న గారి భాస్కర్ రెడ్డి, గోదా రమేష్ యాదవ్, నరేందర్ రెడ్డి, పకీర్ భాష, రంగంపల్లి నారాయణ గౌడ్, లక్ష్మయ్య యాదవ్, యాదయ్య, జంగయ్య, రామకృష్ణ, శేఖర్ గౌడ్, ధనుంజయ, ఖాజా పాషా, శ్రీకాంత్ గౌడ్, హరికృష్ణ యాదవ్, రవి, గంటల శంకరయ్య, షాబాద్ శంకరయ్య, అశోక్, శ్రీను, కార్తీక్, అంజయ్య, నారాయణ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

## కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

**తలకొండపల్లి ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని లింగరావుపల్లి గ్రామానికి చెందిన కళ్యాణ లక్ష్మి చెక్కు లను సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. గ్రామానికి చెందిన కాళ్ల నందిని, టేకూరి అనూష , బొచ్చుపల్లి అశ్విని, బక్కిమమతలకు మంజూరైన ఒక లక్ష 116 రూపాయల చెక్కులను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో అన్ని సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. నిరుపేదలకు, ఇండ్లు లేని వారిని గుర్తించి అందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని, గ్రామంలో అవసరమగు మురుగు కాలువలు, సిసి రోడ్లు మొత్తం ఎమ్మెల్యే కసిరెడ్డి సహకారంతో పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. పార్టీలకతీతంగా గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు తీసుకుపోయేందుకు కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ జీనుకుంట్ల శ్రీనివాస్, నాయకులు రాములు రబ్బాని బొచ్చుపల్లి శీను సాయిలు జంగమ్మ చెన్నమ్మ లక్ష్మమ్మ గ్రామ ఇబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్‌లో ఉచిత ఆరోగ్య శిబిరం

**73 మందికి వైద్య పరీక్షలు**

**షాద్‌నగర్ టౌన్, ఏప్రిల్ 11 (ప్రభాతవార్త):** షాద్‌నగర్ మున్సిపాలిటీ 7వ వార్డు ఈశ్వర కాలనీలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ మెడికల్ క్యాంపును ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇక్కడ బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా చేసి, అవసరమైన వారికి మందులను కూడా ఉచితంగా అందజేస్తారని ఆయన పేర్కొన్నారు. వైద్యాధికారి డాక్టర్ సాదిక్ అహ్మద్ పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో మొత్తం 73 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు తెలిపారు. అనంతరం ఆయన డ్రగ్ అబ్యూస్ (మాదకద్రవ్యాల దుర్వినియోగం) గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. యువత గంజాయి, హెరాయిన్, కొకైన్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల మెదడు, గుండె, కాలేయం, కిడ్నీలు దెబ్బతింటాయని, జ్ఞాపకశక్తి తగ్గి డిప్రెషన్‌లోకి వెళ్తారని హెచ్చరించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలంటే చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని, క్రీడలు, యోగా వంటి మంచి హాబీలతో బిజీగా ఉండాలని, ఏవైనా సమస్యలు ఉంటే తల్లిదండ్రులు లేదా టీచర్లతో చర్చించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ ప్రవీణ్, కౌన్సిలర్ పెంటయ్య, మాజీ కౌన్సిలర్ లతా శ్రీశైలం గౌడ్, ఏ.ఎన్.ఎమ్ రామదేవి, ఆశాలు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.



హెల్త్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ కృషి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ ముందుంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ అన్నారు. శనివారం వికారాబాద్‌లో మండల కార్యదర్శి అనంతయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో ఆమె పాల్గొని కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నిరంతరం బడుగు, బలహీన, మధ్యతరగతి, పేద ప్రజల కోసం, మహిళలు, సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు ఈ విధంగా అన్ని వర్గాల ప్రజల కోసం నిరంతరం సిపిఐ పార్టీ దాని ప్రజా సంఘాలు పనిచేస్తున్నాయని అన్నారు. ఒక్క ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు, ఒక ఎమ్మెల్సీ, ఈ పార్టీకి ప్రతినిధిగా ఉండి అసెంబ్లీలో ఏ విధంగా అన్ని వర్గాల ప్రజల కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని గుర్తు చేశారు. నిజాయితీగా, నిస్వార్థంగా పోరాటాలు చేసే పార్టీకి తమ వంతుగా ఈ ప్రాంత ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి పీర్ మొహమ్మద్, జిల్లా కార్యవర్గ సభ్యులు, వెంకటేష్, అబ్దుల్లా, గంటి సురేష్, కౌన్సిల్ సభ్యులు చంద్రయ్య, మహిళా సమాఖ్య నాయకురాలు విమలమ్మ, తదితరులు పాల్గొన్నారు.



కర పత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఐ నాయకులు

## మృతుని కుటుంబానికి పరామర్శ

**కోట్‌పల్లి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త;** వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల పరిధిలోని బార్వాద్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ పార్టీ చెందిన కొత్తపల్లి నాగిరెడ్డి తండ్రి వీరారెడ్డి మరియు ప్యాట నర్సిములు తండ్రి ప్యాట బిచ్చయ్య అనారోగ్యంతో మృతి చెందాడు విషయం తెలుసుకున్న వికారాబాద్ బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ శనివారం నాడు మృతి చెందిన కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అయన వెంట కోట్‌పల్లి మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు వెంకటేష్‌యాదవ్, నాయకులు తదితరులు ఉన్నారు.



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

## విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ

**శామీర్‌పేట, ఏప్రిల్ 11 ప్రభాతవార్త :** కొల్తూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను హైదరాబాద్ విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) సోమిరెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు డిక్షనరీలను పంపిణీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న సమ్మెటివ్ పరీక్షల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం, డిజిటల్ పాఠ్యాంశాల గురించి ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసు కున్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వినియో గించుకుని జీవితంలో అత్యున్నతంగా స్థిరపడాలని ఆయన ప్రోత్స హించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కమలాకర్, హెచ్ఎం, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న విద్యాశాఖ ఆర్జేడీ సోమిరెడ్డి

## అంబేద్కర్ ఉత్సవాలకు ఆహ్వానం పలికిన యువజన సంఘం

**యాచారం, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి నీ ఆహ్వానించినట్లు నందివనపర్తి అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు కొంగరి యాదగిరి తెలిపారు. మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో ఏప్రిల్ 14 నిర్వహించే అంబేద్కర్ ఉత్సవాలకు యువజన సంఘం అధ్యక్షులు కొంగర యాదగిరి ఆధ్వర్యంలో నాయకులు రాచర్ల వెంకటేశ్వర్లు, బిలకంటి చంద్రశేఖర్ రెడ్డి లతో కలిసి యోజన సంఘం అధ్యక్షులు కొంగరీ యాదగిరి, విహెచ్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ల జంగయ్య, యంజాల చంద్రకాంత్ గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేసినట్లు తెలిపారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని ఉత్సవాలకు తప్పకుండా హాజరు అవుతానని తెలిపారు. గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు వివరించారు. ఈ కార్యక్రమంలో యంజాల అంజయ్య, కందికంటి రాందాస్, ముచర్ల ఆనంద్, యంజాల యాదయ్య, కాళ్ల రవిబాబు, పంది విజయ్ కుమార్, ముచ్చర్ల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న రాచర్ల,బిఎన్ఆర్, యువజన సంఘం నాయకులు

## విరాళాలు సేకరణ

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్, 11,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని లాల్‌పహాడ్‌లో శనివారం సిపిఐ నాయకులు విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి పిలుపుమేరకు ఇంటింటికి సిపిఐ లో భాగంగా విరాళాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బుద్దుల జంగయ్య మాట్లాడుతూ ఏప్రిల్ ఒకటవ తేది నుంచి 20 తేది వరకు ఇంటింటికి సిపిఐ ప్రజల వద్దకు సిపిఐ ప్రజా సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు ఉద్యమాలకు బాటలు వేయడం కోసం ప్రజల నుంచి విరాళాలు సేకరించి భవిష్యత్తులో సమస్యలపై ప్రజా ఉద్యమాలను నిర్మించడం కోసం విరాళాలు సేకరించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లేడు చౌదరిగూడ మండల కార్యదర్శి జిల్లెల్ల వెంకటేష్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు ఆకాశనాయక్, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు బాలరాజ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



లాల్‌పహాడ్‌లో విరాళాలు సేకరిస్తున్న సిపిఐ నాయకులు

## కోట్‌పల్లి ప్రాజెక్ట్ అలుగు వద్ద ఇసుక అక్రమ రవాణా :వాహనం సీజ్

**ధారూర్, ఏప్రిల్ 11, ప్రభాత వార్త:** మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్ట్ అలుగు వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న అశోక్ లీలాండ్ ట్రాలీ ఆటోను అటవీ శాఖ అధికారులు శనివారం పట్టుకున్నారు. అధికారుల కథనం ప్రకారం.. నాగసమందర్ గ్రామానికి చెందిన మోగులయ్య అనే వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా ప్రాజెక్ట్ పరిసరాల్లో ఇసుక నింపుతుండగా, అటవీ శాఖ బిట్ ఆఫీసర్ మధుకర్ రెడ్డి, ప్రొటెక్షన్ వాచర్ మహేష్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్రమ రవాణా గుట్టు రట్టు కావడంతో వాహనాన్ని స్వాధీనం చేసుకుని, అటవీ శాఖ రేంజ్ కార్యాలయానికి తరలించి సీజ్ చేసినట్లు బిట్ ఆఫీసర్ మధుకర్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ సంపదను అక్రమంగా తరలిస్తే ఉపేక్షించేది లేదని, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



అటవీ శాఖ అధికారుల అదుపులో ఇసుక ట్రాలీ ఆటో

## ఆలయ నిర్మాణానికి రూ.51 వేల వితరణ

**కోట్‌పల్లి, ఏప్రిల్ 11, ప్రభాతవార్త;** వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల కేంద్రంలోని శ్రీ అంజనేయస్వామి గుడి పునర్నిర్మాణానికి కోట్‌పల్లి బీఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సుందరి అనిల్, ఆర్థిక సాయం రూ.51 వేలు అందజేశారు. ఈకార్యక్రమంలో అంజనేయస్వామి గుడి కమిటీ సభ్యులు బీజెపి పార్టీ మండల అధ్యక్షులు శివకుమార్, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉప్పరి మహేందర్, మాజీ సర్పంచు జ్ఞానేశ్వర్, మాజీ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ అమర్నాథ్ పంతులు, కిరన్, ప్రేమ్, సమ్మయ్య, విజయ్‌కుమార్, కృష్ణ, రమేష్, లక్ష్మినారాయణ, కొత్తపల్లి మాజీ సర్పంచు గోడ్డలి మల్లయ్య, శ్రీనివాస్, సాదత్, తదిత రులు పాల్గొన్నారు,



చెక్కు అందజేస్తున్న బిఆర్ఎస్ మండల అధ్యక్షులు సుందరి అనిల్

## హిందూ సమ్మేళనంను విజయవంతం చేయాలి

**కీసర, ఏప్రిల్11, ప్రభాతవార్త:** హిందూ సమ్మేళనంను విజయవంతం చేయాలని ప్రముఖ సినీ నటులు సివిఎల్ నరసింహ్మారావు అన్నారు. కీసర సర్కిల్ పరిధిలోని చీర్యాల గ్రామంలోని రామాలయ సన్నిధిలో శనివారం హిందూ సమ్మేళనం చైర్మన్ చిందం నాగేష్ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సమ్మేళనంలో పాల్గొని జయప్రదం చేయడానికి ప్రతి హిందువు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రామాలయ కమిటీ చైర్మన్ శివలింగా శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు కోల అశోక్ యాదవ్, రామిడి వెంకట్‌రెడ్డి, పులుగుర్ల లావణ్య శ్రీనివాస్, తుంగ ధర్మేందర్, నాయకులు బర్లపాటి జయరాం, ఏలూరి భాస్కర్, రామిడి మల్లారెడ్డి, ఏలూరి సత్యనారాయణ, బోడ శ్రీనివాస్, ఏలూరి రాజు, బోడ లింగయ్య, వల్లాల ప్రణీత్, మొగుళ్ల శ్రీకాంత్‌రెడ్డి, సహదేవ్, దొంకని రమేష్, సింగిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఏలూరి రమేష్ ముదిరాజు, భార్గవ్, శ్రీనివాస్, కోల సాయికుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



హిందూ సమ్మేళనం ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న సినీ నటులు నరసింహ్మారావు

## హకీంపేట్ ఆర్టీసి బిసి ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులుగా నూనెముంతల రవీందర్‌గౌడ్ నియామకం

**శామీర్‌పేట, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** హకీంపేట్ ఆర్టీసి డిపో బిసి ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులుగా నూనెముంతల రవీందర్‌గౌడ్ నియమితులయ్యారు. శనివారం శామీర్‌పేట మండలం హకీంపేట్ ఆర్టీసి డిపోలో ఆర్టీసి బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆయనను నియమించటంతో దీంతో హకీంపేట్ ఆర్టీసి డిపో మేనేజర్ సరితదేవి చేతుల మీదుగా నియామకం పత్రాన్ని ఆయన అందుకున్నారు. పలువురు ఆర్టీసి బిసి ఉద్యోగ సంఘం నాయకులు గౌరవాధ్యక్షులుగా నియమితులైన రవీందర్‌గౌడ్‌ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సరితదేవి, ఎంఎఫ్ రాంమోహన్, సెక్యూరిటీ హెడ్ సుదర్శన్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.




హకీంపేట్ ఆర్టీసి డిపో బిసి ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులుగా నూనెముంతల రవీందర్‌గౌడ్ నియామకం డిపో మేనేజర్ సరితదేవి చేతుల మీదుగా అందుకున్న అభినందనలు అందుకున్న దృశ్యం

## సిఎం సహాయనిధి నిరుపేదలకు వరం

**కీసర, ఏప్రిల్11, ప్రభాతవార్త:** సిఎం సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ముప్పు రామారావు అన్నారు. శనివారం నాగారం డివిజన్‌కి చెందిన హేమచందర్‌కి 60 వేలు, కీసర సర్కిల్ పరిధిలోని ఆర్‌జికే కాలనీకి చెందిన ఆలియాబేగంకి 60 వేల రూపాయల సిఎం సహాయనిధి చెక్కులను అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజంగా అర్హులైన పేదలకు చేరాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభు త్వం పనిచేస్తుంద న్నారు. అనారోగ్యం ,ప్రమాదాలు, ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బంది పడుతున్న పేద కుటుంబాలకు సిఎం సహాయనిధి ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ప్రజలు తమ సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. భవిష్యత్తులో నియోజకవర్గ ప్రజలకు అన్ని విదాలుగా అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈగ శ్వేత రాజు ముదిరాజు, నాగారం డివిజన్ మహిళా అధ్యక్షురాలు స్వప్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సిఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ

## గురునానక్ విద్యా సంస్థల రజతోత్సవ వేడుకలు

**- నూతన లోగో ఆవిష్కరణ**

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ విద్యాసంస్థల 25వ రజతోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ యొక్క నూతన లోగోను ఆవిష్కరించారు. ముందుగా విద్యా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ సర్దార్ తవీందర్ సింగ్ కోహ్లీకి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సంకేత్, డాక్టర్ దేవ్‌వ్రత్‌సింగ్, డాక్టర్ రవి దాసరి మాట్లాడుతూ.. ఉన్నత విద్యారంగంలో ఈ సంస్థ చేస్తున్న కృషిని కొనియాడారు. గురునానక్ యూనివర్శిటీ ఛాన్సిలర్ సర్దార్ జి.ఎస్.కోహ్లీ మాట్లాడుతూ.. ఈ ఏడాది 234 సంస్థల ద్వారా 1,689 మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. ప్రముఖ అంతర్జాతీయ సంస్థలు ఈ నియామక ప్రక్రియలో పాల్గొన్నాయని వివరించారు. డా. హెచ్.ఎస్. సైనీ మాట్లాడుతూ.. సాంకేతిక మార్పులకు అనుగుణంగా విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని సంస్థ నిర్వాహక సంచాలకులు డాక్టర్ హెచ్.ఎస్. సైనీ సూచించారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, విశేష సేవలు అందించిన అధ్యాపకులకు పురస్కారాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డా.కలైరాసన్, డా.ఎస్ శ్రీనాథరెడ్డి, డా.బి వెంకటరమణారెడ్డి, డా.విశాల్ వాలియా, డా. సంజీవ్ శ్రీవాస్తవ, డా.రిషి సయాల్, డా.ఎస్.వి. రంగనాయకులు విద్యాసంస్థల ఉన్నతాధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




గురునానక్ విద్యాసంస్థల నూతన లోగోను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## ఆదిత్య పరాశ్రీ స్వామికి హిందూ సమ్మేళనం ఆహ్వానం

**ధారూర్, ఏప్రిల్ 11, ప్రభాత వార్త:** నారాయణపేట జిల్లా బీజ్వార్ నియోజకవర్గంలోని శ్రీ అంబాత్రేయ క్షేత్రంలో కొలువై ఉన్న పూజ్య గురువులు ఆదిత్య పరాశ్రీ స్వామి వారిని పలువురు ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల ఏప్రిల్ 21వ తేదీన ధారూర్ మండల కేంద్రంలోని ఎస్.ఆర్ గార్డెన్‌లో నిర్వహించ తలపెట్టిన భారీ హిందూ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ స్వామి వారికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ధారూర్ మండల అధ్యక్షులు రాజ్ నాయక్, బీజెపి వికారాబాద్ అసెంబ్లీ కోఆర్డినేటర్ వడ్ల నందు, వెంకట్ రెడ్డిలు స్వామి వారిని కలిసి కార్యక్రమ ఉద్దేశ్యాన్ని వివరించారు. ఏప్రిల్ 21న ఉదయం 9:00 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమ్మేళనం ద్వారా హిందూ ధర్మ ప్రచారం, సామాజిక ఐక్యతను పెంపొందించడమే లక్ష్యమని వారు పేర్కొన్నారు. స్వామి వారి రాక ఈ కార్యక్రమానికి ఎంతో ఆధ్యాత్మిక శోభను ఇస్తుందని, భక్తులకు దిశానిర్దేశం చేసినట్లవుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.



స్వామివారికి ఆహ్వానం పలుకుతున్న ధారూర్ మండలం నాయకులు



తుల్జా భవాని మాతకు గంగాభిషేకం చేసేందుకు మంజీరా జలాలను తీసుకుపోతున్న మహిళలు

## తుల్జా భవాని మాతకు మంజీర గంగాభిషేకం

**పుల్కల్, ఏప్రిల్ 11:** మండల పరిధిలోని పెద్దారెడ్డిపేటలో కొలువుండి భక్తులచే నిత్య పూజలందుకుంటూ భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీ తుల్జాభవాని మాత 33వ వార్షిక జాతర ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ అర్చకులు మాత నర్సమాంబ గారి ఆధ్వర్యంలో వేద పండితులు వేద మంత్రాలు వల్లిస్తూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ శివారులోని మంజీర నది నుంచి 251 మంది మహిళలు ఏక రూప దుస్తువులు ధరించి ఆగి కలశాలలో నీటిని ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారిక అభిగంగాభిషేకం చేశారు. ఉత్సవాలకు సదా శివపేటకు చెందిన ప్రముఉఖ వ్యాపారి చిందికేరరి సతీష్ కుమార్, రాజు పటేల్, కాంగ్రెస్ నాయకులు కుమ్మరి లింగయ్య, ఆలయ అర్చకులు పరశురాం, చిందం నగేష్ తదితరులు పాల్గొన్నారు.

### మెల్లాచెరువు శుభ్రతలో మాస్ మ్యూచువల్ ఉద్యోగులు



మెల్లాచెరువు శుభ్రత కార్యక్రమం కొనసాగుతున్న దృశ్యం

**రామచంద్రాపురం, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత పట్ల నిబద్ధతను చాటుతూ మాస్ మ్యూచువల్ కంపెనీ 30 మంది ఉద్యోగులు మెల్లా చెరువు సరస్సులో నిర్వహించిన శుభ్రత కార్యక్రమంలో తేన గ్రీన్ ఆర్మీతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో మాస్ మ్యూచువల్ కంపెనీ నుంచి డాక్టర్ రమేష్ దర్బా, నటరాజ్, భవాని, తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ నుంచి అధ్యక్షులు రమణ ఈశ్వర్‌గారి, సభ్యులు దీప్తిరెడ్డి, రవి కిరణ్, రామ్ కుమార్, శ్రీకాంత్, లావణ్య, శ్వేత చౌదరి, దీపక్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులందరికి అక్రిడేషన్ కార్డులు

**జహీరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** జిల్లాలో వివిధ పత్రికలలో (ప్రింట్ అండ్ ఎలక్రానిక్ మీడియా) పని చేస్తున్న అర్హులైన ఒక్కరికి అక్రిడేషన్ కార్డులు ఇప్పించేందుకు ప్రయత్నిస్తామని టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంకే ఫైసల్ అన్నారు. శనివారం పట్టణంలోని అక్రిడేషన్ కమిటి సభ్యునిగా నియమితులైన జర్నలిస్ట్ అక్రమ్ పటేల్‌కు ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఫైసల్ ముఖ్య అతిథిగా హాజరై జర్నలిస్టులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రభుత్వం ఈ సంవత్సరం కొత్తగా 252 జీవో తీసుకువచ్చిందని, కొత్తగా తెచ్చిన జీవోతో చిన్న, పెద్ద పత్రికలతో పాటు జర్నలిస్టులకు ఎంతో ఇబ్బందిగా మారిందని విచారం వ్యక్తం చేశారు. జీవోలో సర్క్యులేషన్ ఏబిసి, పిఆర్ఐ సర్టిఫికెట్ ప్రకారం అక్రిడేషన్‌లు ఇస్తామని ప్రభుత్వం చెపడం సరికాదన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పని చేస్తున్న జర్నలిస్టులకు సర్కులేషన్‌తో సంబంధం లేకుండా అక్రిడేషన్‌లు అందించాలని ప్రభుత్వానికి సూచించారు. అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలన్నారు. హెల్త్ కార్డులు జర్నలిస్టులకు కార్పోరేట్ ఆసుపత్రిలో క్యాష్ లెస్ వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నేషనల్ కౌన్సిల్ సభ్యులు సిద్దన్న పాటిల్, జహీరాబాద్ టియుడబ్ల్యూ అధ్యక్షులు మినాజ్, జిల్లా ఉర్దూ జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు హాజీ, డాక్టర్ నసీరుద్దీన్, స్థానిక జర్నలిస్టులు జి విష్ణువర్ధన్, అంజయ్య, ఆహ్మద్, షకీల్ ఆహ్మద్, అయూబ్ పాషా, మాణిక్ పాటిల్, ఎజాజ్ పాషా, నసీరుద్దీన్, గౌరేలతో పటు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని..ఫార్మసిలో ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మడం చట్టరీత్యా నేరమని డ్రగ్ ఇన్స్‌పెక్టర్ వినయ్ సుష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీవోఎస్ భవన్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా డ్రగ్స్ రహిత సమాజం, మందుల వాడకంపై రాష్ట్ర ఈగల్ టాస్క్ ఫోర్స్ సిఐ ప్రవీణ్‌కుమార్, ప్రభుత్వ ఆసుపత్రి నోడల్ అధికారి డాక్టర్ వినోద్, సిద్దిపేట ఫార్మసీ షాపుల యజమానులతో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మెడికల్ షాపులు డ్రగ్ కంట్రోలర్ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని వైద్యులు ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మెడికల్ షాపులో మందులు విక్రయించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

రోగులు వైద్యుల సలహా లేకుండా మందులు వాడడం వలన సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే ప్రమాదం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ మందులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజంను రూపొందించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. జిల్లా కేంద్రంలో మందుల వాడకంపై భారీ ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సత్యం, వెంకటేశ్వరరావు, వినోద్‌శంకర్,శ్రీనివాస్, సిద్దేశ్వర్ శివ తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 11,ప్రభాతవార్త :** అవినీతి అధికారులు ఎంతపెద్దటివారైన వదలిపెట్టే ప్రసక్తి లేదని సామాజిక కార్యకర్త గాదగోని చక్రధర్‌గౌడ్ అన్నారు.శనివారం ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ఓ విలువైనా భూ విషయంలో రికార్డుల నుంచి పేర్ల తొలగింపు విషయమై టివోపీటీలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికార పార్టీ నాయకులకు జేబు సంస్థలకు లాభం చేకూర్చేలా జిల్లాలో ఉన్నతాధికారి వ్యవహరించి సామాన్యులకు అన్యాయం చేయడం హేయమైన చర్య అన్నారు. అధికార పార్టీ నాయకులు, అధికారులు కలిసి సామాన్యులకు అన్యాయం చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. అధికార పార్టీ నాయకులను, అధికారులను చట్ట ప్రకారం ఎదుర్కొవడానికి సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి విధులు నిర్వహిస్తే చట్ట ప్రకారం ఎదురయ్యే పరిణామాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. భూ వివాదంలో బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తానని తెలిపారు.

## ఆదాయ పన్ను జాబితాలో ప్రసిద్ధ ఉత్పత్తిదారుల కంపెనీ డైరెక్టర్ల పేర్లు...!?

**- రేషన్ కార్డులు రద్దయ్యే అవకాశం- ఆ డైరెక్టర్లకు ఇన్కమ్ టాక్స్ గుబులు**

**- లబోదిబోమంటున్న డైరెక్టర్లు-సుమారు కోటిన్నర బదిలీ జరిగినట్లు అనుమానాలు**

**అక్కన్నపేట, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** ఆ డైరెక్టర్లకు ఇన్కమ్ టాక్స్ గుబులు పట్టుకుంది. ఆ గ్రామంలో ఏ నలుగురు కలిసిన చోట ఇన్కమ్ టాక్స్ చెల్లిస్తున్నట్లు డైరెక్టర్ల పేర్లు వచ్చాయని చర్చ జోరందుకుంది. అక్కన్నపేట మండలం కుందనవాణిపల్లి గ్రామంలో ప్రసిద్ధ రైతు ఉత్పత్తిదారుల కంపెనీకి సంబంధించిన కొందరు డైరెక్టర్లు ఆదాయపన్ను కడుతున్నట్లు నోటీసులో పేర్లు రావడం మండల వ్యాప్తంగా కలకలం రేపుతోంది. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి మండల తహసీల్దార్ కార్యాలయానికి చేరిన టాక్స్ చెల్లింపుల జాబితాలో ఈ కంపెనీకి చెందిన దాదాపు ఆరుగురు డైరెక్టర్ల పేర్లు ఉండటం చర్చనీయాంశంగా మారింది. డైరెక్టర్ల వ్యక్తిగత ఖాతాల్లోకి నిధులు జమై, వాటిపై ఇన్కమ్ టాక్స్ చెల్లించినట్లు సమాచారం బయటకు రావడంతో కంపెనీ నిధులు గోల్మాల్ అయ్యాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే కంపెనీ నిధుల్లో ఎలాంటి అక్రమాలు జరగలేదని అధ్యక్షుడు సామిరెడ్డి చెబుతున్నారు. గ్రామంలో పెద్ద మొత్తంలో వ్యాపారాలు చేసే వారు కాకపోయినా, డైరెక్టర్ల పేర్లపై లక్షల రూపాయల లావాదేవీలు జరిగి టాక్స్ చెల్లించడం వెనుక అసలు కారణం ఏంటని, దానిపై సందేహాలు వెలువేత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి నిజానిజాలు వెలికి తీయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**ఇన్కమ్ టాక్స్ జాబితా వచ్చింది విచారణ చేస్తున్నాం**
**... తహసీల్దార్ మధుసూధన్**

ఆదాయ పన్ను జాబితాలో ప్రసిద్ధ ఉత్పత్తిదారుల కంపెనీ డైరెక్టర్లకు ఇన్కమ్ టాక్స్ నోటీసులు వచ్చాయనే ఆరోపనలు రావడంతో ఈ విషయంపై ప్రభాతవార్త తహసీల్దార్ సింహాచలం మధుసూదన్ వివరణ కోరగా తమకు కలెక్టర్ కార్యాలయం నుండి ఇన్కమ్ టాక్స్ కట్టిన జాబితా రావడం నిజమేనని, అందులో డైరెక్టర్ల పేర్లు కూడా ఉన్నాయని తమ సిబ్బంది వారి ఇంటికి వెళ్లి విచారణ కొనసాగుతుందన్నారు. ఎవరైనా ఇన్కమ్ టాక్స్ కడితే వారి రేషన్ కార్డులు తొలగిస్తామని, దాంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించవని ఆయన స్పష్టం చేశారు.

## త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**మర్కుక్, ఏప్రిల్ 11 (ప్రభాతవార్త):** త్రాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని నూతన బోరు వేయించి త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేసినట్లు సర్పంచ్ దుబాసి భవాని బాలకిషన్, మాజీ ఎంపిపి పాండుగౌడ్, బిసిసెల్ మండల అధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్‌లు అన్నారు. మండల పరిధిలోని పాములపర్తి మదిర గ్రామం ఇంద్రనగర్ కాలనీలో శనివారం నూతన బోర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరి సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చొరవ తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇంద్రనగర్ కాలనీ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జుట్టు సుధాకర్, పాలకవర్గ సభ్యులు మ్యాకల శ్రీనివాస్, నీరుడు రాజు, చెక్కల వరలక్ష్మి స్వామి, తాడూరి నవనీత లక్ష్మణ్‌గౌడ్, మల్లేశం, కరుణాకర్, లక్ష్మి నరేష్, కాలనీ వాసులు చెక్కల బాల్‌నర్సు, కనకయ్య, అశోక్, మల్లేష్, శివ, కిష్టయ్య, కృష్ణ, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



నూతన బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్ భవాని బాలకిషన్

# కన్నుల పండుగగా రామాలయ వార్షికోత్సవ వేడుకలు

**పెద్దశంకరంపేట, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** పట్టణంలోని శ్రీ సీతారామచంద్రస్వామి పునః ప్రతిష్ట ప్రథమ వార్షికోత్సవ ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుండి ఆలయంలో వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారణలతో పుణ్యాహవాచనము, నవగ్రహ పూజ హోమము, తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేయడంతో పాటు పూజలు చేశారు. వివిధ రకాల పూలతో ఆలయాన్ని సర్వంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులందరికీ తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు.. బాధ్యులు రాగం సిద్దేశ్వర్ . మురళి పంతులు, కందుకూరి రవీందర్. అన్నారం సత్యనారాయణ.. దస్వంత్ ..సుభాష్ గౌడ్. డాక్టర్ అనిల్. సంగమేశ్వర్. కృష్ణమూర్తి . సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



విరాళాలు సేకరిస్తున్న సిపిఐ నాయకులు

## దోపిడి రహిత సమాజ నిర్మాణం కోసమే సిపిఐ నిరంతర పోరాటాలు

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** నిరంతరం ప్రజల పక్షాన నిలబడి, దోపిడి రహిత సమాజ నిర్మాణం కోసమే భారత కమ్యూనిస్టు పార్టీ బలమైన పోరాటాలు చేస్తుందని సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ అన్నారు. ప్రజలకు మరింత చేరువయ్యే లక్ష్యంతో సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని శనివారం సంగారెడ్డి పట్టణంలో ఈ.టి. నరసింహ ప్రారంభించి, ఇంటింటికి తిరిగి సిపిఐ పార్టీ చరిత్ర, పోరాటాలు, త్యాగాలు, సాధించిన విజయాలను ప్రజలకు వివరిస్తూ, పార్టీ బలోపేతానికి విరాళాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఈ.టి. నరసింహ మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ఉమ్మడి మెదక్ జిల్లాలో అనేక భూపోరాటాలు, కార్మికులు మరియు ప్రజా సమస్యలపై అవిశ్రాంత పోరాటాలను చేసిన చరిత్ర సిపిఐ ఉందని గుర్తు చేసారు. . ఈ కార్యక్రమంలో సిపిఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్, జిల్లా సహాయ కార్యదర్శిలు ఆనంద్, ఎంఎ. రెహమాన్, సంగారెడ్డి టౌన్ కార్యదర్శి మహబూబ్ ఖాన్ , డి హెచ్ పి ఎస్ జిల్లా కన్వీనర్ గడ్డం కిరణ్ కుమార్,నేతలు సిహెచ్ కాశీనాథ్,అశోక్, రుబేన బేగం, కళావతి, లక్ష్మి,సతీష్ ,లింగం, కిరణ్ పాల్గొన్నారు..

## డ్రగ్స్ కంట్రోల్ అండ్ రెగ్యులేటరీ స్ట్రెంగ్తెనింగ్ డే విజయవంతం

**సంగారెడ్డి మున్సిపాలిటీ , ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన డ్రగ్స్ కంట్రోల్ అండ్ రెగ్యులేటరీ స్ట్రెంగ్తెనింగ్ డే కార్యక్రమం శనివారం సంగారెడ్డి లోని వీరభద్ర నగర్, కెమిస్ట్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ప్రజలు, విద్యార్థులు, కెమిస్టులు మరియు సంబంధిత భాగస్వాములు హాజరయ్యారు. అవగాహన పాంప్లెట్లను ఆవిష్కరించారు.అలవాటు చేసే ఔషధాల దుర్వినియోగంపై అవగాహన యాంటీబయాటిక్స్‌ను సరైన విధంగా వినియోగించడం చెల్లుబాటు అయ్యే ప్రిస్క్రిప్షన్‌తోనే ఔషధాల విక్రయం షెడ్యూల్ హెచ్ 2 ఔషధాలపై క్యూ ఆర్ కోడ్ ధృవీకరణ ఔషధ దుష్ప్రభావాల క్యూ ఆర్ ఆధారిత నివేదిక లైసెన్స్ పొందిన మెడికల్ షాపుల ఆన్లైన్ ధృవీకరణ నకిలీ/నాసిరకం ఔషధాలపై ఫిర్యాదులకు డీసీ ఏ హెల్ప్‌లైన్ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ పి. రాము డీఎస్పీ బి. పుష్పన్ కుమార్ , డ్రగ్స్ ఇన్స్పెక్టర్లు రవికిరణ్ రెడ్డి, చంద్రశేఖర్, శ్రీకాంత్, ప్రవీణ్, వరప్రసాద్ మరియు కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఈర్ల కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి అనుముల సంతోష్ కుమార్, కోశాధికారి ఏదిరే రమేష్, పట్టణ అధ్యక్షులు దశరథ, కార్యదర్శి శశికాంత్ కోశాధికారి కల్బగూర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

పాపన్నపేట, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :ఈ నెల 19న ఆదివారం సాయంత్రం 4 గంటలకు మండల కేంద్రమైన పాపన్న పేట ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్న హిందూ సమ్మేళనాన్ని భక్తులు, హిందువులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని హిందూ సమ్మేళన సమితి అధ్యక్షులు చింతకాయల దుర్గేష్ జి పిలుపునిచ్చారు. ఈసందర్భంగా మాట్లాడుతూ. హిందూ సమ్మేళనం నేపథ్యంలో హిందూ సమాజాన్ని సంఘటితం చేయడం సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించడం లక్ష్యంగా ఈ హిందూ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజంలో ఐక్యతను పెంపొందించడమే కాకుండా యువతలో దేశభక్తి, సంస్కృతి పట్ల అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం దోహపడుతుందని పేర్కొన్నారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా బ్యాతోల్ తిమ్మాయపల్లి శాంతానంద స్వామిజి, వనముల ఓంకార్ జి ఆర్ ఎస్ ఎస్ మెదక్ జిల్లా కార్యవాహ హాజరై ప్రసంగించనున్నట్లు తెలిపారు. వారి ఉపన్యాసాలు హిందూ ధర్మం, సంస్కృతి, సమాజా నిర్మాణం వంటి అంశాలపై ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తాయని చెప్పారు. సమ్మే ళనంలో ఆధ్యాత్మిక ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి గీతాలు వంటి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు, హిందూ సమాజ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**..గన్య తండా సర్పంచ్ నీల పాండు**

**చిలిపిచెడ్, ఏప్రిల్ 11 ప్రభాతవార్త :** రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ నీల పాండు పేర్కొన్నారు. శనివారం చిలిపిచేడ్ మండలంలోని గన్యతండా, గౌతపూర్ గ్రామంలో నాబార్డు రైతు ఉత్పత్తుల సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గౌతపూర్, గన్య తండా సర్పంచ్ బల్యాత్ రెడ్డి, నిల పాండు, సంఘం అధ్యక్షుడు యాషిన్ శ్రీనివాస్ రెడ్డి, ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని అన్నారు.





హనుమాన్ ఆలయంలో వెండి అభరణాలు సమర్పిస్తున్న హరీష్‌రావు

## హనుమాన్ సర్వ జగత్ రక్షకుడు...

**సిద్దిపేట రూరల్/సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** హనుమాన్ సర్వ జగత్ రక్షకుడు...హనుమాన్ మాలధారణకు నెలవు సిద్దిపేట అని..స్వాముల దీక్షా ఫలించి సంకల్పాలు నెరవేరాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు.అనంతరం ఆలయంలో అంజనేయ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి వెండి అభరణాలు సమర్పించారు.

**పెద్దమ్మ తల్లి అనుగ్రహంలో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి**

పెద్దమ్మ తల్లి అనుగ్రహంతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని...అమ్మ అనుగ్రహంతో అన్నింటా శుభం చేకూరాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని వెల్కటూర్‌లో శనివారం పెద్దమ్మ దేవాలయంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. వెల్కటూర్ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు. పెద్దమ్మ దేవాలయానికి తన వంతు సహకారం అందించానని భవిష్యత్‌లో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. ఆయా కార్యక్రమాల్లో బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని..రైతుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తూ..పంట కొనుగోలు చేయడం లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును ఆయన శనివారం సందర్శించగా పొద్దుతిరుగుడు ,మొక్కజొన్న ధాన్యం గత నాలుగు రోజుల నుంచ కొనుగోలు చేయడం లేదని రైతులు హరీష్‌రావు విన్నవించారు. ఆయన వెంట అధికారులతో ఫోన్‌లో మాట్లాడి మార్కెట్ యార్డును సందర్శించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నారాయణఖేడ్,ఆదిలాబాద్, నిజామాబాద్ కేంద్రాల్లో జొన్న కొనుగోలు సెంటర్‌లను ప్రారంభం చేయలేదని వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి మద్దతు ధర అందించాలన్నారు.



మార్కెట్ యార్డులో రైతులతో మాట్లాడుతున్న హరీష్‌రావు

## మహిళా శక్తికి కొత్త ఊపిరి

**గుమ్మడిదల కాంగ్రెస్ మహిళా బాధ్యతలు మోనిక రెడ్డి**

**గుమ్మడిదల,ఏప్రిల్ 11ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగాన్ని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా గుమ్మడిదల మండలంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. దోమడుగు 9వ వార్డుకు చెందిన మద్ది మోనిక రెడ్డి భర్త విష్ణు వర్ధన్ రెడ్డిని గుమ్మడిదల మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా నియమిస్తూ అధికారిక నియామక పత్రాన్ని కాటా సుధారాణి శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమానికి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా రాణి శ్రీనివాస్ రెడ్డి హాజరై మోనిక రెడ్డికి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా మోనిక రెడ్డి మాట్లాడుతూ,తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, తెలంగాణ ప్రదేశ్, జనరల్ సెక్రటరీ కావ్యశ్రీ రెడ్డి, జిల్లా ఇన్చార్జి నాయిని రజిత, జిల్లా మహిళా అధ్యక్షురాలు కాటా సుధారాణి శ్రీనివాస్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.మహిళల హక్కుల పరిరక్షణ, వారి అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తాను. కాంగ్రెస్ పార్టీ బలోపేతమే నా లక్ష్యం" అని స్పష్టం చేశారు.మహిళలను రాజ కీయంగా ముందుకు తీసుకురావడంలో ఈ నియామకం కీలక మైలురాయిగా మారనుందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడ్డాయి.

ఈ కార్యక్రమంలో పటాన్ చేరు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ జయమ్మ, పటాన్ చేరు టౌన్ అధ్యక్షురాలు శోభ కృష్ణారెడ్డి,గుమ్మడిదల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు, కౌన్సిలర్ చిమ్ముల నరేందర్ రెడ్డి,వడ్డే కృష్ణ, బ్యాగరి వరలక్ష్మి, గోకరి నిర్మల,మాజీ మండల అధ్యక్షుడు మద్ది వీరారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ గోవర్ధన్ గౌడ్, బ్యాగరి కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## మల్లారెడ్డి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



ఉచిత వైద్యశిబిరంలో మందులు అందజేస్తున్న సర్పంచ్ జుల అనిల్.

**చిలిపిచెడ్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన చిలిపిచెడ్ గ్రామ పంచాయతీ ఆవరణలో మల్లారెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు డాక్టర్ త్రిష, ప్రీతి పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిబిరానికి వచ్చిన రోగులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి, అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. అత్యవసర చికిత్స అవసరమున్న రోగులను ఉచితంగా రవాణా సౌకర్యం కల్పించ దంతో పాటు, అన్ని రకాల పరీక్షలు నిర్వహించి, చికిత్స అంది స్తామన్నారు. సర్పంచ్ జుల అనిల్, ఉప సర్పంచ్ శ్రీరాములు, ఆస్పత్రి సిబ్బంది హరికృష్ణ, జయాశీల, మధులత, నందిని, నాగేశ్వర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



బోరు బావిని బాగు చేస్తున్న కొల్కూర్ గ్రామస్థులు

## ముందు చూపుతో బోరు బావులను బాగు చేస్తున్న కొల్కూర్ సర్పంచ్

**సదాశివపేట,ఏప్రిల్ 11 (ప్రభాతవార్త):** ఎండలు తీవ్రమవుతున్నందున భూగర్భజలాలు తగ్గిపోయే అవకాశం ఉందని కొల్కూర్ సర్పంచ్ ముత్తంగి ఉమారాణి నాగరాజు అన్నారు. గ్రామంలోని చర్చి ముందుగా బోరుబావిలో మోటారు పనిచేయకపోవడంతో సర్పంచ్ ఉమారాణి నాగరాజు గ్రామ స్తులతో కలిసి మోటారును పైకి తీయడానికి ప్రయత్నం చేయుచున్నారు. ఎండలు విపరీతంగా పెరగడం వలన గ్రామంలో నీటి కొరత రాకుండా ఉండడానికి పాడైపోయిన బోర్లను సైతం సాధ్యమైనంత వరకు బాగు చేయడానికి ప్రయత్నిస్తున్నామని వారు అన్నారు. మిషన్ భగీరథ నీళ్ల కూడా అంతంతమాత్రంగానే వస్తున్నాయని గ్రామంలో నీటి ఎద్దడి రాకుండా ఉండడానికి ప్రభుత్వం కూడా సహకరించాలని వారు అన్నారు.



బేగంపేట్‌లో పెళ్లికుమార్తెకు పుస్తె మెట్టెలు బహుకరిస్తున్న కళ్యాణి మహేష్‌గౌడ్

## నూతన వధువుకు పుస్తె మెట్టెలు బహుకరణ

**కంది, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బేగంపేట్ గ్రామానికి చెందిన మంగలి నిర్మద దాసు కుమెర్తెకు ఈదులకంటి కళ్యాణి మహేష్ పెస్తుమెట్టెలను బహుకరించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ప్రతాప్‌గౌడ్, వైస్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, సాయి కిరణ్, మహేందర్ నాయక్, నర్సింగ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ యూనుస్, కౌన్సిలర్లు

## ఏరియా ఆసుపత్రిని సందర్శించిన మున్సిపల్ చైర్మన్

**-రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశం**

**జహీరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని శుక్రవారం మున్సిపల్ చైర్మన్ మహ్మద్ యూనుస్ మున్సిపల్ కౌన్సిలర్‌లతో కలిసి సందర్శించారు. ఆసుపత్రిలోని వివిధ వార్డుల్లో చికిత్స అందుకుంటున్న రోగులతో చైర్మన్, కౌన్సిలర్‌లు మాట్లాడుతూ అందుతున్న చికిత్స తీరును అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది సమయసారణి పాటిస్తున్నారా లేదా అని వారు ఆరా తీశారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు, ఎదురవుతున్న ఇబ్బందుల గురించి రోగులు, వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ యూనుస్ మాట్లాడుతూ పేదలకు వైద్యం అందించడంలో డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యం రోగులకు సకాలంలో అందు బాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు. ఓ డాక్టర్ విధి నిర్వాహణలో అలక్ష్యం వహిస్తుండటం పట్ల చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో స్పందించిన సూపరిండెంట్ సంబంధిత డాక్టర్‌కు మెమో జారీ చేస్తామని చైర్మన్‌కు భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ శ్రీధర్, కౌన్సిలర్లు జమీల్, జాంగిర్, అక్రం, మహేష్ చౌహాన్ వకీల్, జావిద్, నిజామ్, ఇర్మియా, రఫీ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కండెం నర్సింలు, నాయకులు కొత్తకాపు సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## రాజ్యసభ సభ్యుడిని సన్మానించిన గిరిధర్‌రెడ్డి



రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి

**జహీరాబాద్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** రాజ్యసభ సభ్యులు ఏ నరేందర్‌రెడ్డిని సెట్విన్ రాష్ట్ర చైర్మన్ నందారం గిరిధర్‌రెడ్డి శనివారం హైద్రాబాద్‌లోని దస్పల్ల హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి తదితరులు ఉన్నారు.

## అన్ని దానాల కంటే నీటి దానం చాలాగొప్పది

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త :** వేసవి కాలంలో బాటసారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతో ఉపయోగ పడుతాయని మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, వాసవీక్లబ్స్ ఇంట ర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ అడ్మిన్ గంప శ్రీనివాస్‌లు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పాత బస్టాండు ఆవరణలో శనివారం వాసవిక్లబ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. అన్ని దానాల కంటే నీటి దానం చాలగొప్పదన్నారు. వేసవి కాలంలో బాటసారుల దాహార్తిని తీర్చడానికి యువజన, స్వచ్ఛంధ సంస్థలు, క్లబ్‌లు చలి వేంద్రాలు ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో వాసవీక్లబ్స్ ప్రతినిధులు డాక్టర్ మాంకాల నవీన్, చింత ప్రసాద్, గంప కృష్ణమూర్తి, పోశెట్టి శ్రీకాంత్, కూర శ్రీనివాస్, ఉమారాణి, నాగమల్లి కిషన్, సంధ్య, బుక్క అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

## 37 మందికి 14.50 లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కులు

**చౌటకూరు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 37 మందికి 14.50లక్షల రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కులను మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు నత్తి దశరథ్, ఎంపిపి మాజీ అధ్యక్షులు భూంరెడ్డి సుభాష్‌రెడ్డి, ఆత్మ కమిటి చైర్మన్ మల్లారెడ్డిలు పంపిణి చేశారు. పేదలు అనారోగ్యానికి గురైతే వైద్యం అందుకునేందుకు సిఎంఆర్ఎఫ్ పథకం ఒక వరంలా పనిచేస్తోందని నాయకులు గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బోడపట్ల గణేష్ ముదిరాజ్, గొల్ల మల్లేశం, ఉప సర్పంచ్ గొల్ల మహేష్, మాజీ ఉప సర్పంచ్ గుండన్నగారి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మల్లికార్జున్‌గౌడ్, మండల శివకుమార్, మహేందర్‌రెడ్డి, మంగలి మహేశ్, వసంత్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

**అక్కన్నపేట, ఏప్రిల్ 11, ప్రభాతవార్త** ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని అక్కన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి అన్నారు. శనివారం అక్కన్నపేట మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో కలిసి మండల కేంద్రంలో పర్యటించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలను ప్రయివేట్ పాఠశాలలకు పంపి ఆర్థికంగా నష్టపోవద్దని, తప్పనిసరిగా ప్రతీ విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని, విద్య ద్వారానే వారి భవిష్యత్తు మెరుగుపడుతుందని తెలిపారు. పిల్లలు క్రమంగా చదువుకుంటే ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొని తల్లిదండ్రులకు విద్య ప్రాధాన్యతను వివరించారు.

